



అద్దె భవనంలో మెదక్ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల

గురుకులాల్లో సమస్యల తిష్ట



సంగారెడ్డిలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో ధ్వంసమైన తరగతి తలుపు

వసతులు లేక విద్యార్థుల అవస్థలు
ఏళ్ల తరబడి అద్దె భవనాలే దిక్కు
మంజూరు ఒకచోట.. నిర్వహణ మరోచోట
కంపు కొడుతున్న పరిసరాలు

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసింది. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా గురుకులాల్లో విద్యా బోధనను, మంచి పుష్టికరమైన బోజనం అందించాలన్న ప్రభుత్వం లక్ష్యం నెరవేరడం లేదు. మహాత్మ జ్యోతిబాపులే, సాంఘిక సంక్షేమ, మైనారిటీ రెసిడెన్షియల్, గిరిజన గురుకులాలు తదితర విభాగాల ద్వారా జిల్లావ్యాప్తంగా పలు చోట్ల విద్యాలయాలు కొనసాగుతున్నాయి. సదుద్దేశంతో ఏర్పాటైన ఈ విద్యాలయాలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. పలుచోట్ల కనీస వసతులు కరువై విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అద్దె భవనాల్లో ఇరుకు గదుల్లో విద్యా బోధన సాగుతున్నది. మరుగుదొడ్లు కూడా సరిపడా లేక ఇక్కట్ల పాలవుతున్నారు. ఫర్నిచర్ లేక కటిక నేలపై విద్యనభ్యసిస్తున్నారు. ఆయా పాఠశాలల గదులకు తలుపులు, కిటికీలు లేకపోవడంతో విద్యార్థులు ఈగలు, దోమలతో వేగలేకపోతున్నారు. గురుకులాల నిర్వహణ అస్తవ్యస్థంగా మారి వంట శాలలు, మరుగుదొడ్లు, స్నానపు గదులు కంపుకొడుతున్నాయి.

-మెదక్/సంగారెడ్డి టౌన్

గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు లేక పలుచోట్ల అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్ల అద్దె భవనాలు కూడా దొరక్క ఇతర ప్రాంతాలకు తరలించాల్సి వస్తున్నది. కొన్నిచోట్ల ఉపాధ్యాయులు సౌకర్యాల పేరుతో తమకు అనుకూలంగా ఉండే ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపణలున్నాయి. దీంతో, మంజూరైన చోటే గురుకులాలు నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాలు అమలు కావడం లేదు. అద్దె భవనాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. క్రీడా మైదానాలు లేక ఆటలకు దూరమవుతున్నారు.

సంగారెడ్డి జిల్లా పరిధిలో..

- సదాశివపేటలోని పూర్తిగా శిథిలావస్థలో ఉన్న దేవదాయ శాఖకు చెందిన వందల ఏళ్లనాటి పురాతన భవనంలో మైనారిటీ గురుకుల పాఠశాల కొనసాగుతున్నది. పక్కా భవనం నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పురాతన భవనంలో కొనసాగుతున్న పాఠశాలలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ విద్యనభ్యసిస్తున్నారు.
- జోగిపేటలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో అద్దె భవనంలో ఇరుకిరుకు గదుల్లో కొనసాగుతున్నది.
- హత్నూరలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఫర్నీచర్ లేక డార్మెంటరీ హాలులో విద్యార్థులకు క్లాసులు కొనసాగిస్తున్నారు. ఈ పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక బహిరంగ ప్రదేశాలలో కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు.
- కొండాపూర్ మండలం గిర్మాపూర్ గ్రామ శివారులో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంచినీటి శుద్ధి ప్లాంట్ నిరుపయోగంగా ఉండటంతో తాగునీటి సమస్యతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.
- కంగ్టిలోని గిరిజన గురుకుల పాఠశాలలో బెంచీలు లేకపోవడంతో విద్యార్థులు నేలపై కూర్చుని విద్యనభ్యసిస్తున్నారు.
- జహీరాబాద్ మండలం అల్గోల్‌లో గల మైనారిటీ గురుకుల పాఠశాలకు ప్రహరీ లేక విషసర్పాలు సంచరిస్తున్నాయి. పాఠశాల ఎదుట ఇంకుడుగుంత ప్రమాదకరంగా మారింది. బూచనెల్లి మైనారిటీ గురుకుల పాఠశాలలో తాగునీటి సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- సంగారెడ్డి, కొత్లాపూర్‌లో ఉన్న జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల్లో మరుగుదొడ్లు సరిగ్గా లేక విద్యార్థినులు ఇబ్బందుల పాలవుతున్నారు. కొత్లాపూర్‌లో గురుకుల పాఠశాల పైనుంచి విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ఆయా పాఠశాల భవనాలకు కిటికీలు, తలుపులు లేక విద్యార్థులు దోమలు, ఈగలు రాకుండా ప్లాస్టిక్ సంచులు, బ్లాంకెట్లను అమర్చుకున్నారు.
- పుల్కల్‌లోని సింగూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, బొమ్మారెడ్డిగూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఆయా గురుకులాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధిత శాఖల అధికారులు పట్టనట్లుగా వ్యవహరించడం పట్ల సర్వాత్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి.



రామాయంపేట బాలికల గురుకులం ఆవరణలో పేరుకుపోయిన చెత్త



సంగారెడ్డిలోని బాలుర గురుకుల పాఠశాలలో మురుగు ప్రవాహం



గిర్మాపూర్ బాలుర గురుకుల పాఠశాలలో ఆర్వోప్లాంట్ దుస్థితి

మెదక్ జిల్లా పరిధిలో..

- మెదక్ పట్టణానికి మంజూరైన సోషల్ వెల్ఫేర్ గురుకుల మహిళా డిగ్రీ కళాలను భవనాలు లేక రామాయంపేటలో అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు.
- హవేళీఘనపూర్ మండల కేంద్రంలో జ్యోతిరావు పూలే బాలికల, బాలుర గురుకుల పాఠశాలలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. ఇటీవల ఈ రెండు పాఠశాలలను ఖాళీ చేయాలని భవన యజమాని నోటీసులు ఇచ్చారని ప్రిన్సిపాల్ తెలిపారు. 850 మంది విద్యార్థులు చదువుతున్న ఈ గురుకులాలను ఉన్నఫలంగా ఖాళీ చేయడం ఎలాగో తెలియడం లేదని ప్రిన్సిపాల్ వాపోతున్నారు.
- వెల్దుర్తిలో బాలికల రెసిడెన్షియల్ పాఠశాల మంజూరై ఐదేళ్లు గడుస్తున్నా సొంత భవనం లేక తూప్రాన్‌లో అద్దె భవనంలో నడుపుతున్నారు. అక్కడ కూడా వసతులు సరిపోక ఇంటర్మీడియట్ తరగతులను రావెల్లిలో నడుపుతున్నారు.
- నర్సాపూర్ గురుకుల పాఠశాల, కళాశాలలను కూడా రావెల్లిలోనే నిర్వహిస్తున్నారు.
- చేగుంటలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల ఆవరణ పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి చిట్టడవిని తలపిస్తున్నది. మెదక్ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల ఆవరణలోనూ పిచ్చిమొక్కలు మొలిచాయి.
- కౌడిపల్లిలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో సరిపడా మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- నర్సాపూర్ గిరిజన గురుకుల పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడుతున్నది. ఎలక్ట్రిక్ స్విచ్‌లు సరిగాలేక షాక్ కొడుతున్నది.



సదాశివపేటలో శిథిలావస్థకు చేరిన గురుకుల పాఠశాల



తూప్రాన్ ఆస్పత్రిలో జ్వరాలతో చికిత్స పొందుతున్న రోగులు

విజృంభిస్తున్న విష జ్వరాలు

తూప్రాన్ ఆస్పత్రికి పెరిగిన రోగుల తాకిడి
డెంగీ లక్షణాలు.. ప్లేట్‌లెట్లు తగ్గడంతో విషమిస్తున్న పరిస్థితి

తూప్రాన్, ఆగస్టు 11: తూప్రాన్ డివిజన్‌లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. విషజ్వరాలు వ్యాపిస్తుండడంతో ప్రజలు మంచం పడుతున్నారు. డెంగ్యూ లక్షణాలతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల చేపట్టిన జ్వర సర్వే, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలతోనూ ఫలితం కనిపించడం లేదు. తూప్రాన్ ప్రాంతీయ ఆస్పత్రికి రోజూ 50 మంది, ప్రైవేటు ఆస్పత్రుల్లో రోజూ 200 వరకు చికిత్స పొందుతున్నట్టు తెలుస్తున్నది. తూప్రాన్, మనోహరాబాద్, వెల్దుర్తి, మాసాయిపేట, చేగుంట, శివ్వంపేట, చిన్నశంకరంపేట, నార్సింగి, సిద్దిపేట జిల్లా రాయపోలు, దౌల్తాబాద్ మండలాల నుంచి జ్వర బాధితులు చికిత్స కోసం తూప్రాన్‌కు వస్తున్నారు. జలుబు, సాధారణ జ్వరంతో మొదలై తీవ్రమైన జ్వరం, ఒళ్లునొప్పులు, కీళ్ల నొప్పులు, తీవ్రమైన తలనొప్పిగా మారుతున్నదని వైద్యులు పేర్కొంటున్నారు. దీనికితోడు పలువురిలో డెంగీ లక్షణాలు కనిపిస్తున్నాయని, జర్వంతో ఆస్పత్రికి వస్తున్నవారిలో ప్లేట్‌లెట్లు రోజురోజుకూ తగ్గిపోతున్నాయని తెలిపారు. తూప్రాన్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి బాధితులు పెద్దఎత్తున వస్తుండటంతో ఆస్పత్రిలో బెడ్లు నిండిపోయి అదనపు బెడ్లు ఏర్పాటు చేసి వైద్యం అందజేస్తున్నారు.

పరిశుభ్రత, అప్రమత్తత అవసరం



ప్రజలు విషజ్వరాల బారినపడకుండా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. పరిసరాలు శుభ్రంగా లేకపోయినా.. నీరు నిల్వ ఉన్నా దోమలు వృద్ధిచెంది డెంగ్యూ, మలేరియా విజృంభించే అవకాశం ఉంది. జ్వరం రాగానే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

-డా.అమర్‌సింగ్, తూప్రాన్ ఆస్పత్రి సూపరింటెండెంట్

మొక్కుబడిగా జ్వర సర్వే

గ్రామాల్లో విష జ్వరాలు విజృంభిస్తుండడంతో ప్రభుత్వం క్రమం తప్పకుండా జ్వర సర్వే నిర్వహించాలని ఆదేశించింది. కానీ క్షేత్రస్థాయి సిబ్బంది మాత్రం తూతూమంత్రంగా సర్వే నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి. అందుకే జ్వరాలు ముదిరి గ్రామాల్లో వైద్య అందక పట్టణాలకు చికిత్స కోసం వస్తుండడంతో పెద్ద సంఖ్యలో కేసులు నమోదువుతున్నాయి. అయినా, ఈ విషయాలు సర్వే తెలియకపోవడం గమనార్హం. జ్వర సర్వేలు నిబద్ధతతో నిర్వహిస్తే పరిస్థితి ముదరకముందే వైద్యం అంది పరిస్థితి అదుపు దాటదని పలువురు పేర్కొంటున్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దేశభక్తిని పెంపొందించేందుకే 'హర్ ఘర్ తిరంగా'

- ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి
- బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రోహిత్ చాహల్
- ప్రజల సొమ్మును దొచుకుంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్
- రింగ్‌రోడ్డు టెండర్ గోల్‌మాల్, ఎఫ్ 1 రేసుపై చర్యలేవీ?
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



సంగారెడ్డిలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న రోహిత్ చాహల్, రఘునందన్‌రావు తదితరులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 11 : దేశభక్తి పెంపొందించేందుకే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమానికి నిర్వహిస్తున్నట్లు బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రోహిత్ చాహల్ తెలిపారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డిలో జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రోహిత్ చాహల్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగా యాత్ర పేరిట కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని కోరారు. ప్రతీ ఇంటిపై మువ్వన్నెల జాతీయ జెండా ఎగరేయాల్సిన బాధ్యత ప్రతీ భారతీయుడిపై ఉందన్నారు. మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ జాతీయ జెండా కార్యక్రమం అంటే మన పనికాదనే నిర్లిప్త భావన ప్రజల్లో ఉండడం దురదృష్టకరమని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడుస్తున్నా జాతీయ జెండా ఎగురవేయాలని ఇంటికి వెళ్లి చెప్పే పరిస్థితి ఉండడం బాధాకరమన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం కొట్లాడే అవకాశం మనకు రాలేదని, అమరులైన యోధుల త్యాగాలను గుర్తుచేసుకునేందుకు కనీసం జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఒక్కొక్కరు పదిళ్లపై జెండా ఎగురవేయించే బాధ్యత తీసుకోవాలని కోరారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను పార్టీలు, కుల, మతాలకతీతంగా నిర్వహించాలని సూచించారు. అంతకుముందు ఐబీ వద్ద స్వామి వివేకానంద విగ్రహానికి, జిల్లా కోర్టు వద్ద సర్దార్ వల్లభాయ్‌పటేల్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, జిల్లా అధికార ప్రతినిధి డా.రాజుగౌడ్, రాష్ట్ర నాయకుడు జగన్, పట్టణ అధ్యక్షుడు ద్వారకారవి, నాయకులు వాసు, నాగరాజు, పవన్ రవిశంకర్, నరేన్, రాకేశ్, సమరసింహారెడ్డి, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిలో ఆ రెండు పార్టీలు ఒక్కటే

కాళేశ్వరమైనా, మేడిగడ్డైనా, సుంకేశులైనా ప్రజల సొమ్మును దొచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకటేనని రఘునందన్‌రావు ఆరోపించారు. ఆగస్టు 2న సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలితే అసెంబ్లీలో ఎందుకు ప్రస్తావించలేదని కేటీఆర్‌ను ప్రశ్నించారు. మరోవైపు తప్పుచేసిన అయ్యా, కొడుకులను జైలుకు పంపిస్తామని అన్న సీఎం రేవంత్‌రెడ్డి ఎనిమిది నెలలుగా ఎందుకు నోరు మెదపకపోవడం లేదని ప్రశ్నించారు. ఎఫ్-1 కార్ రేసు ఈవెంట్, రింగ్ రోడ్డు టెండర్‌లో గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపించిన రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు చర్యలెందుకు తీసుకోవడం లేదని నిలదీశారు.

నామినేటెడ్ పదవులపై ఆశలు

మార్కెట్ కమిటీ, ఆత్మ కమిటీ, ఆలయ కమిటీల్లో స్థానం కోసం ఎదురుచూపులు



నర్సాపూర్, ఆగస్టు 11: నర్సాపూర్ నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల భర్తీ ఎప్పుడెప్పుడా అని అధికారపార్టీ స్థానిక నేతలు ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గ స్థాయినేతలు రాష్ట్రస్థాయి పదవులు వస్తాయని ఎదురు చూస్తుండగా.. రెండోస్థాయి నాయకులకు స్థానికంగా ఉండే పదవులపై ఆశతో ఉన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో మార్కెట్ కమిటీ పాలకవర్గంతో నియోజకవర్గంలో రెండు ఆత్మకమిటీ పాలకవర్గాలు నియమించాల్సి ఉంది. సికింద్లాపూర్ ఆలయ కమిటీ, నర్సాపూర్ లక్ష్మీనారాయణస్వామి ఆలయ కమిటీ, తుంకి పోచమ్మ ఆలయ కమిటీలను భర్తీ చేయాల్సి ఉంది. పదేళ్ల అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పార్టీనే నమ్ముకున్న క్యాడర్ పదవులపై ఆశతో ఉన్నారు. కానీ, పార్టీ అధిష్ఠానం పదవుల భర్తీపై కసరత్తు మొదలుపెట్టిన దాఖలాలు కనిపించడం లేదు. నియోజకవర్గంలో కీలకంగా ఉండే మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని చాలామంది ఆశిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పలు నియోజకవర్గాలలో మార్కెట్ కమిటీ పాలకవర్గాల నియామకమవుతున్నాయి. ఎవరికివ్వాలనే స్పష్టత లేక నియోజకవర్గ నేతలు మార్కెట్ కమిటీ నియామకంపై ప్రయత్నాలు చేయడం లేదనే ప్రచారం ఉన్నది. దీంతో పాటు నర్సాపూర్, కౌడిపల్లి ఆత్మ కమిటీలతో పాటు ఆయా ఆలయాల పాలకవర్గాలను కూడా నియమించాల్సి ఉండగా ఏ నిర్ణయం తీసుకోలేదు. నియామకాలపై నాన్చుతుంటే క్యాడర్‌లో నిరాశ పెరుగుతుందని, తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదముంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.



రాచన్నస్వామి ఆలయంలో లక్షబిల్వార్చనలో పాల్గొన్న భక్తులు

రాచన్నస్వామి ఆలయంలో లక్షబిల్వార్చన

కోహీర్, ఆగస్టు 11: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని బడంపేట గ్రామంలోని రాచన్నస్వామి ఆలయంలో ఆదివారం లక్షబిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులేకాకుండా చుట్టుపక్కల మండలాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన స్వామివారికి బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. శ్రావణమాసం ముగింపు వరకు స్వామివారి సన్నిధిలో ఈ కార్యక్రమం ఉంటుందని ఆలయ ఈవో శివరుద్రప్ప తెలిపారు.

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలి

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాల్‌స్వామి

సిద్దిపేట అగ్రికల్చర్, ఆగస్టు 11: ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.15 వేలు ఇవ్వాలని, వారికి నష్టం కలిగించే పరీక్షను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాములు గోపాల్‌స్వామి డిమాండ్ చేశారు. ఆశావర్కర్ల సమస్యలపై సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, గతంలో ఆశావర్కర్లు రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులు నిరవధిక సమ్మె చేశారని, ఆనాటి హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు హామీలు నేటికీ అమలు కావడం లేదని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని హామీనిచ్చిందని, దాన్ని కూడా అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశావర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఆందోళన, పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి భాస్కర్, శ్రామిక మహిళా కన్వీనర్ పద్మ, ఆశా వర్కర్లు, యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాల్‌స్వామి

భార్యను చంపడానికి యత్నించిన భర్తకు రిమాండ్

సిద్దిపేట క్రైం, ఆగస్టు 11: భార్యను చంపడానికి యత్నించిన భర్తను సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ లక్ష్మీబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన నీలం రాజు తన భార్య నీలం అనితపై అనుమానంతో చంపాలని నిర్ణయించుకున్నాడు. శనివారం రాత్రి గ్రానైట్ రాయితో తలపై మోదడంతో ఆమెకు తీవ్ర రక్తస్రావమైనది. చుట్టుపక్కల వారు అనితను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి మార్చారు. నీలం రాజును అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అనితను సిద్దిపేట ఏసీపీ మధు, వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబు పరామర్శించారు.


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

సిద్దిపేట పట్టణంలో మహిళల బైక్ ర్యాలీ

సిద్దిపేట క్రైం, ఆగస్టు 11: భారతదేశ జాతీయ సమైక్యత స్ఫూర్తిని చాటేందుకు భారతీయ మహిళా మోర్చా, మహిళా జాగరణ సమితి ఆధ్వర్యంలో సిద్దిపేటలో ఆదివారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుంచి పాత బస్టాండ్ అంబేడ్కర్ చౌరస్తా వరకు వారు బైక్ ర్యాలీ నిర్వహించారు. త్రివర్ణ పతాకాలను చేతబూని. వందేమాతరం, జైహింద్, భారత్ మాతాకీ జై , జాతీయ సమైఖ్యత వర్ధిల్లాలి అంటూ మహిళలు చేసిన నినాదాలు దేశభక్తిని నింపాయి. కార్యక్రమంలో లక్కిరెడ్డి విజయ శుభాకర్‌రెడ్డి, భారతీయ మహిళా మోర్చా సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు ఇర్రి ఉమా సురేషన్‌రెడ్డి, ప్రసన్న, భాగ్యలక్ష్మి, పద్మ, ఉషారాణి, మంజుల, సుమ, విజయలక్ష్మి, కళావతి పాల్గొన్నారు.


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

భవనంపై నుంచి విద్యుత్ తీగలపై పడి కార్మికుడి దుర్మరణం

» నిర్లక్ష్యం వహించిన బిల్డర్, లేబర్ కాంట్రాక్టర్‌పై కేసు నమోదు



రాజు మృతదేహం

పటాన్‌చెరు, ఆగస్టు 11: భవనంపై స్లాబ్ వేసే క్రమంలో ప్రమాదవశాత్తు కింద ఉన్న విద్యుత్ తీగలపై పడి కార్మికుడు దుర్మరణం పాలైన సంఘటన ఆదివారం అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని వాణీనగర్‌లో చోటుచేసుకుంది. అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. వాణీనగర్‌లో బిల్డర్ అశోక్ నూతన భవనాలను నిర్మిస్తున్నాడు. ఓ భవనం స్లాబ్ వేసే క్రమంలో ఇనుప నిచ్చెన నిర్మిస్తున్నారు. అక్కడ ఎద్దుల రాజు (42) అనే కార్మికుడు పని చేస్తుండగా, ప్రమాదవశాత్తు జారి కింద ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలపై పడ్డాడు. కరెంట్‌షాక్‌కు గురై కింద ఉన్న మిల్లర్ బకెట్‌లో పడిపోయాడు. అక్కడే ఉన్న కార్మికులు బాచుపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారని వైద్యులు తేల్చారు. వనపర్తి జిల్లా అమరచింతకు చెందిన ఎద్దులరాజు ఆయన భార్య గోవిందమ్మలు చందానగర్ రెడ్డికాలనీలో నివాసం ఉంటూ కూలీ పనిచేసుకుంటున్నారు. గోవిందమ్మ శనివారం రాత్రి అమీన్‌పూర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిర్మాణంలోని భవనం ముందు ఉన్న 11కేవీ విద్యుత్ తీగలకు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా కార్మికుడి మృతికి కారణమైన బిల్డర్ అశోక్, లేబర్ కాంట్రాక్టర్ శ్రీనివాస్‌పై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

వృద్ధురాలి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

టేక్మాల్, ఆగస్టు 11: వృద్ధురాలి హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. అల్లాదుర్గం సీఐ రేణుక ఆదివారం కేసు వివరాలను వెల్లడించారు. టేక్మాల్ మండలం కాదులూరు గ్రామ శివారులో దత్తాత్రేయ ఆశ్రమంలో అదే గ్రామానికి చెందిన అంజమ్మ కొంతకాలంగా నివాసం ఏర్పరచుకొని ఉంటుంది. ఈనెల 7న రాత్రి ఆశ్రమంలోని గుడిసెలో ఉంటున్న ఆమెను అదే గ్రామానికి చెందిన శివకుమార్ హత్య చేసి పరారయ్యాడు. ఈ మేరకు అజనమ్మ అల్లుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాపు చేపట్టారు. మూడు బృందాలు ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టి జోగిపేటలో అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా, ఆమె వద్ద ఉండే పెన్షన్ డబ్బులు, బంగారం దొంగలించేందుకు ప్రయత్నించగా కేకలు వేసిందని, అరుపులు వినిపించకుండా ముక్కు, నోరు మూడయంతో ఊపిరాడక చనిపోయిందని నిందితుడు చెప్పినట్లు సీఐ వివరించారు. ఆమె చనిపోయిన తర్వాత బంగారు గుండ్లను తీసుకుని పారిపయినట్లు విచారణలో తేలిందని వివరించారు. ఆదివారం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. హత్య కేసును చేధించడంలో భాగస్వాములైన టేక్మాల్ పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు. కార్యక్రమంలో పెద్ద శంకరంపేట ఎస్ఐ శంకర్, టేక్మాల్ ఏఎస్ఐ దయానంద్, సిబ్బంది ఉన్నారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

శివ్వంపేట, ఆగస్టు 11: పొలంలోని గచ్చు బావి చుట్టూ గడ్డిని తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరు మృతిచెందిన సంఘటన అల్లీపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన నిమ్మల యాదయ్య(68) ఆదివారం ఉదయం గ్రామ శివారులో ఉన్న అతని పొలంలో ఉన్న గచ్చు బావి చుట్టూ గడ్డి తీస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడిపోయాడు. బావిలోని నీటిలో మునిగి మృతి చెందాడు. యాదయ్య కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

తండాల్లో తీజ్ సందడి

» లంబాడీ గిరిజనుల సంస్కృతికి ప్రతిక.. » తొమ్మిది రోజుల పాటు వేడుక..



తీజ్ సందర్భంగా లంబాడీ మహిళల నృత్యాలు (ఫైల్)

హుస్నాబాద్, ఆగస్టు 11: గిరిజన తండాల్లో తీజ్ సందడి మొదలైంది. శీతల్ ఉత్సవాలు ముగియగానే తీజ్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తీజ్ ఉత్సవాలు గిరిజనులకు ముఖ్యమైన పండుగ. బతుకమ్మ పండుగ తరహాలో సాగే ఈ ఉత్సవాలు గిరిజనుల సంప్రదాయానికి అద్దం పడుతాయి. లంబాడీలు తమ భాష అచార వ్యవహారాలకు ప్రాధాన్యం ఇస్తారు. చదువుకున్న యువతీ యువకులు కొంత వస్త్ర ధారణ విషయంలో మార్పులు వచ్చినా తమ సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తూనే ఉన్నారు. ఆడపిల్లలు తమ ఆశలు నెరవేరాలని కోరుతూ తొమ్మిది రోజులపాటు ఉత్సహంగా జరుపుకునే పండుగ తీజ్. తమకు త్వరగా వివాహం జరగాలని, మంచి భర్త దొరకాలని, పంటలు సమృద్ధిగా పండి అందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుతూ యువతీయువకులు తీజ్ పండుగను జరుపుకుంటారు. బతుకమ్మ పండుగ మాదిరిగా గోధుమ నారుతో తీజ్ బుట్టలను తయారు చేసి తొమ్మిది రోజులపాటు గిరిజన యువతులు ఉపవాసాలుండి ఎంతో భక్తి శ్రద్ధలతో ఈ పండుగను జరుపుకుంటారు. జిల్లాలో అత్యధికంగా వందకు పైగా గిరిజన లంబాడీ తండాలున్న హుస్నాబాద్ ప్రాంతంలో తీజ్ ఉత్సవాల సందడి నెలకొంది. నియోజకవర్గంలోని మల్లారం తండాలో ఇప్పటికే తీజ్ ఉత్సవాలు ముగిశాయి. హుస్నాబాద్ పట్టణంలో జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గతంలో తీజ్ పండుగ గిరిజన తండాలకే పరిమితం కాగా, ఇప్పుడు పట్టణాల్లోని గిరిజన కుటుంబాలు తమ తండాలకు వెళ్లి ఈ పండుగను ఘనంగా జరుపుకొంటారు. ఎక్కడెక్కడ స్థిరపడిన వారు సైతం ఈ పండుగ రోజుల్లో తమ ఇళ్లకు వస్తారు. అయితే, అన్ని పండుగల్లాగే తీజ్ పండుగను ప్రభుత్వం అధికారికంగా గుర్తించి, నిర్వహించాలని గిరిజనులు కోరుతున్నారు.

నాచగిరి క్షేత్రంలో స్వాతి నక్షత్ర పూజలు



హోమం నిర్వహిస్తున్న దంపతులు

వర్గల్, ఆగస్టు 11: రెండో యాదాద్రిగా పేరొందిన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ఆదివారం స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి విశేషాభిషేకాలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ యాగశాలలో వేద పండితులు హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించడానికి భక్తులు విశేషంగా హాజరై, స్వామివారిని దర్శించుకున్నారు. శ్రావణ మాసం మొదటి ఆదివారం సందర్భంగా క్షేత్రంలో సామూహిక సత్యనారయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. 24 మంది దంపతులు కుటుంబసమేతంగా సత్యదేవుడి వ్రతమాచారించారు. స్వామివారికి 15 నిజాభిషేకాలు, 7 నిత్యకల్యాణాలు జరిగినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్. అన్నపూర్ణ తెలిపారు. ఆలయ అధికారులు సుధాకర్, పాండు, నరేందర్ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

పుల్లూరు బండలో..

సిద్దిపేట రూరల్, ఆగస్టు 11: సిద్దిపేట మండలం పుల్లూరు బండ స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో నరసింహ స్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్ర ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. స్వాతి నక్షత్రం సందర్భంగా ప్రతినేల ఆలయంలో సుదర్శన నరసింహ హోమం, స్వామి వారికి పంచ కలష అభిషేకం నిర్వహిస్తారు. శ్రావణమాసం ఆదివారం రోజున ఉత్సవం ఘనంగా నిర్వహించారు. దేవాలయ వంశ పారంపర్య అర్చకులు కలకుంట్ల రంగాచార్యులు, పొడిచేటి శ్రీనివాసాచార్యులు, రామకృష్ణమాచార్యులు, సాయి కృష్ణ, కలకుంట్ల నచికేత్‌ల ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించారు. అందులో భాగంగా స్వామికి పంచామృతాలతో వేద మంత్రాల మధ్య పంచ కలశ అభిషేకం నిర్వహించారు. దేవాలయం ప్రాంగణంలో సుదర్శన నారసింహ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవంలో గ్రామ మాజీ సర్పంచ్ పల్లె నరేష్ గౌడ్, దేవస్థాన మాజీ డైరెక్టర్ కోడూరి శ్రీనివాస్, గ్రామ యువకులు, సిద్దిపేట సంతోషీమాత దేవాలయ డైరెక్టర్ సత్యం గౌడ్, భక్తులు పాల్గొన్నారు.



స్వాతి నక్షత్రం సందర్భంగా హోమం నిర్వహిస్తున్న అర్చకులు



మాట్లాడుతున్న కాశపాగ ఇమ్మయ్య

క్రిమిలేయర్ వద్దనే వారు ప్రత్యామ్నాయం చూపాలి

» ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు కాశపాగ ఇమ్మయ్య

పుల్‌కల్, ఆగస్టు 11: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి క్రిమిలేయర్ వద్దనే నాయకులు ప్రత్యామ్నాయం చూపాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు కాశపాగ ఇమ్మయ్య కోరారు. చౌటకూర్ మండలం శివంపేట గ్రామంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితుల్లో కూడా సంపన్నవర్గాల వారు ఉన్నారని, వారు రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా ఎదిగారని తెలిపారు. దళితుల్లో ఎదిగిన వారు కింది వర్గాలను ఏ మాత్రం పట్టించుకోకుండా దేశంలో, రాష్ట్రంలో తిష్ఠ వేసుకుని కూర్చున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులలో సామాన్యమైన నిరుపేదలు వారితో చదువులలో గానీ ఉద్యోగాలలో గానీ ఏ మాత్రం పోటీ పడే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత వర్గాలలో వేలు, లక్షల కోట్లకు పడగలెత్తిన ధనికులు క్రిమిలేయర్‌ను అడ్డుకోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. అనేక ప్రాంతాల్లో ఒక కుటుంబం నుంచి రాజకీయంగా ఎదిగిన దళిత నాయకులు వారు వారి కుటుంబాల పిల్లలనే రాజకీయంగా ఎదగనిస్తున్నారు తప్పా ఇతరులను రాజకీయాల్లో ప్రోత్సహించడం లేదన్నారు. ఒక కుటుంబం నుంచి ఎంపీగా, ఎమ్మెల్యేగా ఒకటి, రెండు పర్యాయాలకంటే ఎక్కువ పోటీ చేసే అవకాశం లేకుండా చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో బాబు జగ్జీవన్‌రామ్ సమతా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, వేణుగోపాల్, ఫ్రెండ్స్ యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు పొట్టిగల్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

హైవే విస్తరణ పనుల్లో వేగం

» మార్గంలోని ఆలయాలు, మసీద్‌ల సర్వే
» కమిటీలకు త్వరలోనే నోటీసులు?

కంది, ఆగస్టు 11: అరవై ఐదో నంబర్ జాతీయ రహదారిని ఎక్స్‌ప్రెస్ హైవేగా మార్చడానికి చేపట్టిన పనులు వేగంగా సాగుతున్నాయి. హైదరాబాద్‌లో మదీనాగూడ నుంచి సంగారెడ్డి జిల్లా కేంద్రమైన పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు దాదాపు 30 కిలోమీటర్ల మేర హైవే అథారిటీ అధికారులు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. నాలుగు లైన్లతో ఉన్న ఈ జాతీయ రహదారిని ఆరు లైన్లకు మార్చనున్నారు. దీనికి అనుసంధానంగా సర్వీసు రోడ్లను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు మదీనాగూడ నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు రోడ్డుకిరువైపులా చెట్లను తొలగించారు. అతి త్వరలోనే ఆయా గ్రామాల్లో ఉన్న జాతీయ రహదారికి అనుకొని ఉన్న ఆక్రమణలను, షాపులను, కొన్ని హోటళ్లు, దాబాలను తొలగించనున్నారు.

హైవే విస్తరణలో భాగంగా కందిలోని కొన్ని ఆలయాలు, మసీదుల వద్ద అధికారులు సర్వే చేశారు. ఆయా ఆలయాలతో పాటు మసీదు కమిటీలకు త్వరలోనే నోటీసులు అందజేయనున్నట్లు తెలిసింది. ఏళ్లుగా పూజలు అందుకుంటూ, ఉత్సవాలు, వార్షికోత్సవాలు జరుపుకుంటున్న ఆలయాలు, వందలాది మంది ముస్లింలు ప్రార్థనలు చేసుకుంటున్న మసీద్ తొలగిస్తారన్న ఆందోళన ఆయా గ్రామాల ప్రజల్లో నెలకొంది. దీంతో ఈ ఆలయాలను, మసీద్‌ను హైవే అథారిటీ అధికారులు యథావిధిగా వేరే చోట నిర్మించి ఇస్తారా... లేక రోడ్డు విస్తరణలోని కాస్త మార్పులు చేస్తారా అనే విషయం తెలియాల్సి ఉన్నది.



తూప్రాన్‌లో కొత్త పీర్ల ఊరేగింపు

అల్లాపూర్‌లో కొత్త పీర్ల ఊరేగింపు

తూప్రాన్, ఆగస్టు 11 : తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్‌లో ఆదివారం కొత్త పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. అల్లాపూర్‌కు చెందిన బక్క సాయగౌడ్‌కు కొన్నేళ్ల క్రితం ఇసుక బావిలో పీరి దొరికిందని చెబుతారు. అప్పటి నుంచి ప్రతీ ఏటా మొహర్రం ముగియగానే కొత్త పీర్లను ఏర్పాటు చేసి, గ్రామస్థులకు అనుకూలమైన రోజున పీర్ల ఊరేగింపును నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఆదివారం ఉదయం పీరిని ఊరేగింపుగా తుమ్మ చెరువు వద్దకు తీసుకెళ్లారు. సాయంత్రం కొత్త పీర్లను వీధుల్లో ఊరేగిస్తు ఇంటింటికీ తీసుకెళ్లగా ప్రజలు మొక్కులను తీర్చుకున్నారు.

బంగ్లాదేశ్ ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన

చేర్యాల, ఆగస్టు 1: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, హిందూ ఆలయాల కూల్చివేతను నిరసిస్తూ శనివారం రాత్రి చేర్యాలలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక అభయాంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కరువవడం విచారకరమన్నారు. ఈ విషయమై కేంద్రం చొరవ చూపి బంగ్లాదేశ్ మారణహోమంపై చర్యలు తీసుకుని హిందువులు, హిందు ఆలయాలను కాపాడాలని కోరారు. అనంతరం మృతులకు నివాళులర్పించారు.



చేర్యాలలో కొవ్వొత్తుల ప్రదర్శనతో నివాళులర్పిస్తున్న ప్రజలు

రూ.45 లక్షల విలువ చేసే గుట్కా పట్టివేత



వాహనాల తనఖీల్లో పట్టుబడ్డ గుట్కా లారీ, నిందితులు

లారీ స్వాధీనం.. ముగ్గురి అరెస్ట్

జహీరాబాద్, ఆగస్టు 11: అధికారులు ఎంత నిఘా పెట్టిన అక్రమ రవాణా ఆగడం లేదు. ముఖ్యంగా జిల్లా మీదుగా లక్షల విలువ చేసే నిషేధిత గుట్కా తరలిపోతోంది. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా నుంచి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మీదుగా హైదరాబాద్‌కు గుట్కా తరలిస్తున్న లారీని ఆదివారం జహీరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. లారీలో రూ.45 లక్షల విలువ చేసే నిషేధిత గుట్కా ప్యాకెట్లు ఉండగా స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కాశీనాథ్ మీడియాకు వివరించారు. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా నుంచి టీఎస్07- యూఎల్6886 నంబర్ గల లారీ హైదరాబాద్ వైపు వెళ్తోంది. ఈ క్రమంలో పట్టణంలోని అల్లోల్ చౌరస్తా(డౌన్‌టౌన్) వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్నారు. అనుమానంతో లారీని తనిఖీ చేయగా, అందులో నిషేధిత గుట్కా కనిపించింది. దీంతో ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ అశ్రుతాలి, ఉత్తరప్రదేశ్, కర్ణాటకలకు చెందిన బాబులాల్, జయప్రకాశ్‌లను అరెస్ట్ చేశారు. వీరు వంద బ్యాగుల్లో బీదర్ నుంచి హైదరాబాద్‌కు గుట్కా తరలిస్తున్నట్లు అంగీకరించారు. లారీని, నిషేధిత గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిట్టలోళ్ల నడక యాతన

రోడ్డుకు నోచుకోక.. నడిచే దారి సరిగ్గా లేక ఇబ్బందులు

- పిల్లల చదువులకు ఆటంకం
- రోగమొస్తే ఆస్పత్రికి మోసుకెళ్లాల్సిందే
- దయనీయ స్థితిలో 23 కుటుంబాలు

రామాయంపేట, ఆగస్టు 11 : ఊరికి దూరంగా విసిరేసినట్లుగా ఉంటుంది ఆవాడ. 14 ఏళ్లుగా పూరి గుడిసెల్లోనే జీవనం. కనీసం నడిచేందుకు కూడా దారీ సరిగ్గాలేని స్థితి. ఇదెక్కడో మారుమూల చోట ఉందనుకుంటే పొరపాటే! మండల కేంద్రమైన రామాయంపేటకు నాలుగు కిలోమీటర్ల దూరంలో, గజ్వేల్ మెయిన్ రోడ్డుకు సమీపంలో, వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఉన్న పిట్టల వాడ దుస్థితి ఇది. ఇక్కడ 23 కుటుంబాలకు చెందిన 60 మంది నివసిస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు ఇటువైపు కన్నెత్తిచూడడం లేదు.



ప పిట్టలవారి పూరి గుడిసెలు

ఒక్క సౌకర్యమూ లేదు

పొట్ట చేత పట్టుకుని తిరిగే పిట్టలవాళ్లు మొదట్లో ఆరు కుటుంబాలు ఇక్కడ పూరిగుడిసెలు వేసుకుని స్థిరపడ్డాయి. స్థలాలు కొని గుడిసెలు వేసుకుని ఇపుడు 23 కుటుంబాల వరకు నివసిస్తున్నాయి. ఎప్పటి నుంచో రోడ్డు కావాలని కోరుతున్నా ఆ సమస్య తీర్చేవారు లేరు. వారికి కనీసం తాగునీటి సౌకర్యం కల్పించలేదు. నడక దారీ సరిగ్గా లేక ఎప్పుడో ఒకసారి వారి పిల్లలు స్కూల్‌కు వెళ్తున్నారు. ఉన్నతంగా ఎదగాల్సిన చిన్నారులు చదువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. 40 ఓట్లున్న తమ వద్దకు ఎన్నికల సమయంలో మాత్రమే వస్తారని వారు మండిపడుతున్నారు. ఎవరికైనా రోగమొస్తే భుజాన మోసుకెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఇక్కడ స్థిరపడడమే శాపమా అంటూ వాపోతున్నారు. ఊరికి కొద్ది దూరంలోనే ఉన్నా ఇంత కాలంగా ఏ ఒక్క సౌకర్యమూ దక్కటం లేదని తమ దీనస్థితిని పట్టించుకునే నాథుడే లేడా అని వేడుకుంటున్నారు. రోడ్డు నిర్మించాలని గత ఎమ్మెల్యే పద్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఇకనైనా తమ ప్రధాన సమస్య అయిన రోడ్డును వేయాలని కోరుతున్నారు.



ఈసారి ఓట్లే వేయం

మా ఒక్క సమస్య కూడా తీర్చని నాయకులకు ఈసారి ఓట్లే వేయం. ఇన్నాళ్లుగా ఇక్కడ ఉంటున్నా మమ్మల్ని మనుషులుగా చూడటం లేదు. ఎన్నికలకు ముందు అన్నీ చేస్తామని.. ఆ తర్వాత ఇటు వైపే రారు. సర్పంచ్ ఎన్నికల ప్రచారానికి వస్తే నిలదీస్తాం.

- అంజమ్మ, పిట్టలవాడ



చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిన పొదల మధ్య నుంచే వెళుతున్న పిట్లవాడ వాసులు



పోతిరెడ్డిపల్లి చౌరస్తా జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు

హైవేపై మురుగు ప్రవాహం

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 11 : సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తా జాతీయ రహదారిపై మురుగు నీరు ప్రవహిస్తోంది. చౌరస్తాలోని ఫ్లైఓవర్ సమీపంలో వాణిజ్య వ్యాపారాల సముదాయం ఎదుట ఉన్న డ్రైనేజ్ పైపులైన్ ధ్వంసమై రోడ్డు పైనే ప్రవహిస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం

● ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ● భయంతో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది





హత్నూర తహసీల్దార్ కార్యాలయం, తేమ వచ్చి పగుళ్లు కనిపిస్తున్న గోడ

హత్నూర, ఆగస్టు 11 : హత్నూర తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకున్నది. దశాబ్దాల క్రితం నిర్మించిన భవనం కావడంతో పాతబడింది గోడలు పగుళ్లు ఏర్పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు భవనం తడిసి గోడలు చెమ్మగిల్లాయి. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. తప్పని పరిస్థితిలో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



కార్యాలయ పాత భవనం శిథిలావస్థకు చేరి పగుళ్లు ఏర్పడ్డ విషయమై ఇటీవలే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వీలైనంత త్వరగా నూతన భవనం మంజూరుకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరాం.

- ఫర్హీన్ షేక్, తహసీల్దార్

ఎప్పుడు కూలుతుందో తెలియదు



తహసీల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తుంది. అధికారులు స్పందించి వెంటనే నూతన భవనం మంజూరు చేయాలి.

-బుచ్చేంద్ర మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రామచంద్రాపురం, ఆగస్టు 11 : సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని కొల్లూరు పోలీసు స్టేషన్ పరిధిలో ఓఆర్ఆర్ ఎగ్జిట్-2 వద్ద ఓ గుర్తుతెలియని శవం లభించింది. ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం డయల్ 100కు కాల్ రాగా పోలీసులు కొల్లూరు ఓఆర్ఆర్ ఎగ్జిట్-2 వద్దకు చేరుకున్నారు. 40-45 సంవత్సరాల వయస్సు కలిగి, చామనఛాయ రంగులో ఉన్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. జరిగిందన్నారు. మృతుడి కుడి చేతిపై 'రవితేజ' ఎడమ చేతిపై 'రద' అని రాసి ఉంది. సీఐ రవీందర్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఎనిమిది మందిపై కేసు



బుదేరా చౌరస్తాలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మునిపల్లి, ఆగస్టు 11 : మండల పరిధిలోని బుదేరా చౌరస్తాలో ఆదివారం మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడుపుతున్న ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపితే వారితోపాటు ఇతరులు ప్రమాదాలకు గురవుతారని ఎస్ఐ రాజేష్ నాయక్ వివరించారు. పెద్దలు మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వొద్దని సూచించారు.

ఆలయాల అభివృద్ధికి రూ.10 లక్షలు మంజూరు చేయిస్తా

● నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి, ఆగస్టు 11 : ఆలయాల అభివృద్ధికి సీజీఎఫ్ ద్వారా రూ.10లక్షలను మంజూరు చేయిస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని మన్నెవారి జలాల్‌పూర్ కాళికామాత ఆలయంలో ఆదివారం ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెల్దుర్తిలో ప్రకృతి సూపర్ మార్కెట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో అమ్మవారి ఆలయం నిర్మించారన్నారు. దివంగత వాకిటి లక్ష్మారెడ్డి 25వ వర్ధంతి సందర్భంగా వారి స్మారకార్థం ఈనెల15న నర్సాపూర్‌లో నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రమేష్‌గౌడ్, శివ్వంపేట మాజీ ఎంపీపీ హరికృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

బోనాల ఉత్సవాల్లో..

శివ్వంపేట, ఆగస్టు 11 : రత్నాపూర్, బిజిలీపూర్, కొత్తపేట, చెన్నాపూర్, కొంతాన్‌పల్లిలో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. మండల కేంద్రమైన శివ్వంపేట, ఎదుల్లాపూర్‌లో దళితుల ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు నిర్వహించారు. చెన్నాపూర్, శివ్వంపేట ఉత్సవాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి, రత్నాపూర్‌లో పీసీసీ కార్యదర్శి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి హాజరై పూజలు నిర్వహించారు.

విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకుంటే భవిష్యత్తు

● ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవరెడ్డి

నారాయణఖేడ్, ఆగస్టు 11 : విద్యార్థి దశ నుంచే వివిధ అంశాల పై అవగాహన పెంచుకుంటే చక్కటి భవిష్యత్తు ఉంటుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. పట్టణంలోని మూడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రమశిక్షణ, ఆరోగ్యం, నైతిక విలువలు, పర్యావరణ పరిరక్షణ, కంప్యూటర్ విద్య తదితర అంశాలపై ఉచిత శిక్షణ అందించేందుకు హైదరాబాద్‌లోని బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ సంస్థ చైర్మెన్ కృష్ణపారశెట్టి ముందుకువచ్చారు. సంస్థ ప్రతినిధులైన వాలేరోటెక్నాలజీస్ ప్రైవేట్ సంస్థ ఇండియా ఆపరేటింగ్ హెడ్ ఫణికుమార్ సింహాద్రి, మార్కెటింగ్ మేనేజరు కార్తీక్‌కోరుకొండ, వంశీ తదితరులతో కలసి శిక్షణా కేంద్రాలను ఆదివారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందిస్తున్న ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఐదేళ్లలో నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యను రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో ఉంచాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ శిక్షణలో 50 మందికి కంప్యూటర్ ల్యాబ్‌లు, ఇంటర్‌నెట్ తదితర సదుపాయాలను ఏర్పాటుచేసి సంస్థ వలంటీర్లతో రెండు నెలల పాటు విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో విశ్వనాథ్, నాయకులు అవుటి శంకర్, గుండేరావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ ఫుటేజ్ ద్వారా నిందితుల గుర్తింపు

శివ్వంపేట, ఆగస్టు 11 : మూడు రోజుల క్రితం చోరీకి పాల్పడ్డ నిందితులను సీసీ కెమెరాల ఫుటేజ్ ద్వారా ఆదివారం గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఎదుల్లాపూర్ గ్రామానికి చెందిన పైనం నర్సింహులు పౌల్ట్రీఫామ్ దగ్గర నుంచి ఈనెల 8న మధ్యాహ్నాం ఇనుపకంచె చుట్టను మగ్దుంపూర్ గ్రామానికి గంగయ్యపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు అపహరించుకుపోయి విక్రయించారు. గ్రామంలో సీసీ ఫుటేజ్ ద్వారా నిందితులను గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సమైక్య హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్‌గా శివాజీ

నారాయణఖేడ్, ఆగస్టు 11 : సమైక్య హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నారాయణఖేడ్ చైర్మన్‌గా శివాజీ శ్రీనివాస్‌ను నియమిస్తూ కౌన్సిల్ రాష్ట్ర చైర్మన్ సాయికుమార్ గౌడ్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా శివాజీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల హక్కుల పరిరక్షణ, చైతన్యం కోసం తనవంతు కృషి చేస్తూ, నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

మల్‌చెల్మతండా ఉపాధ్యాయుడికి డాక్టరేట్

జహీరాబాద్, ఆగస్టు 11 : జహీరాబాద్ మండలంలోని మల్‌చెల్మ తండాకు చెందిన ఉపాధ్యాయులు తులసీరాంరాథోడ్‌కు పాండిచ్చేరి యూనివర్సిటీ వారు డాక్టరేట్‌ను అందజేశారు. జాగో బంజారా పేరిట తండాల్లో విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, మూఢనమ్మకాల నిర్మూలన, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన తదితర కార్యక్రమాలను ఆయన చేపట్టారు. ఈ సామాజిక కార్యక్రమాలను పాండిచ్చేరి యూనివర్సిటీ వారు గుర్తించి డాక్టరేట్‌ను అందజేశారు. తులసీరాంరాథోడ్‌కు డాక్టరేట్ రావడం పట్ల పలువురు టీబీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



డాక్టరేట్ అందుకుంటున్న తులసీరాంరాథోడ్

రేపటి వరకు డిగ్రీ స్పెషల్ అడ్మిషన్లు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 11 : ఉన్నత విద్యాశాఖ ద్వారా జరిగే డిగ్రీ స్పెషల్ ఫేస్ అడ్మిషన్లను ఈ నెల 13వ తేదీ వరకు పొడిగించినట్లు తారా కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో సీటు వచ్చి అడ్మిషన్ తీసుకోని వారు 13 వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింట్ చేసుకొని, అడ్మిషన్లు పొందాలని సూచించారు. సందేహాలుంటే 9441069020 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. డిగ్రీలో చేరేందుకు ఇదే చివరి అవకాశమని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

నారాయణఖేడ్, ఆగస్టు 11 : మండలంలోని మాద్వార్ గ్రామానికి చెందిన కొవ్వూరు లక్ష్మయ్య గుండెపోటుతో ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. మృతుడి కుటుంబం నిరుపేదలు కావడంతో లక్ష్మయ్య అంత్యక్రియల నిర్వహణకు ప్రవాస భారతీయులు గుర్రపు మశ్చందర్ రూ.10వేలు అందజేయాలని సూచించగా సంస్థ ప్రతినిధులు అందజేశారు. పేద కుటుంబానికి సహాయం అందించినందుకు మశ్చందర్‌కు మాజీ సర్పంచ్ ఈశ్వర్‌గౌడ్, గ్రామ పెద్దలు కతజ్ఞతలను తెలిపారు.

మాజీ ఎంపీటీసీ గృహప్రవేశానికి ఎమ్మెల్యే హాజరు

చేగుంట ఆగస్టు 11 : చేగుంట మాజీ ఎంపీటీసీ బక్కి లక్ష్మీరమేష్ నూతన గృహప్రవేశ వేడుకకు ఆదివారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని ఎంపీటీసీ దంపతులు సన్మానించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రాజు, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చేగుంట, ఆగస్టు 11 : నార్సింగి మండలం వల్లూర్ గ్రామంలో ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు అబ్దుల్ వాహిద్, మాజీ సర్పంచ్ మహేశ్వరీ అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింలు, నాయకులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ అభయహస్తం' వెంటనే అమలు చేయాలి

గజ్వేల్, ఆగస్టు 11: అంబేడ్కర్ అభయ హస్తం పథకం అమలు చేయాలని డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు కోరారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలు హామీలుగానే మిగిలిపోయాయన్నారు.

ఎస్జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలి

● టీఎస్ఎస్టీయూ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య

చిన్నశంకరంపేట, ఆగస్టు 11 : మొదటి అపాయింట్‌మెంట్ పొందిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని టీఎస్ ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 2022 నుంచి రావల్సిన నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఒకే ఉపాధ్యాయుడు ఉన్న పాఠశాలకు విద్యా వలంటీర్లను నియమించాలన్నారు. జీవో 137ను వెంటనే అమలు చేయాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటింగ్ కల్పించాలన్నారు. మల్టీ జోనల్‌లో జీహెచ్ఎమ్ ప్రమోషన్‌లను జోనల్ జీహెచ్ఎమ్ ప్రమోషన్లుగా ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఎస్టీయూ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కర్రె పోచయ్య

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 11 : ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును కల్పించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాంచందర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అన్ని ప్రాథమిక పాఠశాలలకు పీఎస్‌హెచ్ఎం పోస్టులను మంజూరు చేసి డీఈడీతో పాటు బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు కూడా పదోన్నతులు కల్పించాలని కోరారు. ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 317 జీవో ద్వారా మ్యుచువల్ బదిలీ చేయబడిన ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టాలన్నారు.

పాఠశాలల్లో విద్యా వలంటీర్లను నియమించాలి

జహీరాబాద్, ఆగస్టు 11 : రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల కొరత ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వలంటీర్లను నియమించాలని తపస్ రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో తపస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు భాస్కర్‌దేశ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల ప్రభావంతో కొన్ని ప్రభుత్వ పాఠశాల్లో టీచర్ల కొరత ఏర్పడిందన్నారు. వికారాబాద్ జిల్లాలో కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని అవసరం ఉన్నచోట విద్యా వలంటీర్లను నియమించారని గుర్తుచేశారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కూడా చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తపస్ నాయకులు దత్తాత్రి, అడివప్ప, తుకారాం, శ్రీపాల్, మొగులయ్య పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ సిర్గాపూర్ మండల కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక

కల్హేర్, ఆగస్టు 11 : టీపీటీఎఫ్ సిర్గాపూర్ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. మండల అధ్యక్షుడుగా ఎంఏ రహీం, ప్రధాన కార్యదర్శిగా తావుర్యా నాయక్, ఉపాధ్యక్షులుగా సంతోష్‌కుమార్, లక్ష్మీ, సుభాష్ నాయక్, కార్యదర్శులుగా జాదవ్ గణపతి, ధూమానాయక్, కిషన్, మధురాణిని నియమించినట్లు తెలిపారు. జిల్లా కౌన్సిల్ సభ్యులుగా తావుర్యానాయక్, ఎంఏ రహీం, వరప్రకాష్, తాడూరి రమ్య, రాథోడ్ వెంకట్‌నాయక్ ఎన్నికైనట్లు వెల్లడించారు.. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వెంకట్‌రావ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

● నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, ఆగస్టు 11 : ఉరకులు పరుగుల నేటి జీవనంలో కాస్త సమయం ధ్యానం కోసం కేటాయించడం వల్ల ప్రశాంతతో పాటు ఆరోగ్యానికి మంచిదని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ డి.అశోక్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం పిరమిడ్ మెడిటేషన్ సంస్థ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో ధ్యాన కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలో మాంసహారం వద్దు కూరగాయలే ముద్దు అంటు నినాదాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేంద్రం ప్రారంభించిన సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ మాట్లాడుతూ నర్సాపూర్‌లో పిరమిడ్ సంస్థ ధ్యానం కేంద్రం ప్రారంభించడం అభినందనీయమని, ఇక్కడి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, గురువులు రాజేశ్వర్, భిక్షపతి, వీరప్ప, సురేందర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శేఖర్, రాములు, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ ఆస్తులను దుబారా చేయొద్దు

● తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్

రామచంద్రాపురం, ఆగస్టు 11 : యువకులు వారసత్వ ఆస్తులు విక్రయించగా వచ్చిన మొత్తాన్ని దుబారా చేయొద్దని తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బాలగోని రాములుగౌడ్ అన్నారు. ఆదివారం ఈదులనాగులపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన బాంకెట్‌హాల్‌ను ఆయన ప్రముఖ నిర్మాణ సంస్థల అధినేత కళ్యాణ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాములుగౌడ్, కళ్యాణ్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో నిర్మాణరంగం దేశంలోనే దూసుకుపోతుందన్నారు. యువత నిర్మాణ రంగంలో పెట్టుబడులు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీస శ్రీను, హరిశంకర్‌గౌడ్, మల్లికార్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఆగస్టు 11: గ్రామస్వరాజ్యమే లక్ష్యమని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తీరా గ్రామాలను, స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. దుబ్బాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం మూడువందల మంది బాధితులకు సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా పాలనను గాడీలో పెట్టలేకపోయిందన్నారు. ఎనిమిదినెలల్లో సఫాయి కార్మికులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి గ్రామపంచాయతీలకు దాపురించిందన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం పడకేసిందన్నారు. నిధులివ్వకుండా కార్యదర్శులను స్వచ్ఛదనం, పచ్చదనం చేయాలని ఆదేశిస్తే, ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు.

సగరులు రాజకీయంగా చైతన్యవంతం కావాలి

● సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్

మెదక్/పాపన్నపేట, ఆగస్టు 11 : సగరులు రాజకీయంగా ఎదిగేందుకు స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా చైతన్యం కావాల్సిన అవసరం ఉందని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలె సగరుల చైతన్యాన్ని ప్రదర్శించాల్సి అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఆదివారం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గ మాత ఆలయ సమీపంలో నిర్వహించిన జిల్లా సగర ఎన్నికల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన సగరులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాబోయే పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికలలో సగరులు రాజకీయంగా ఎదగాలని సూచించారు. సగరులను విస్మరించే రాజకీయ పార్టీలను ఓడించడానికి ఏకమవుతామని స్పష్టం చేశారు. జిల్లా సగర సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సందిల సాయిలు, ప్రధాన కార్యదర్శిగా మర్కు నగేష్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో సగర సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మర్కు దత్తాత్రేయ, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి బంగారి అంజనేయులు, మహేందర్, రవీందర్, శ్రీకాంత్, పోచయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్

పీహెచ్‌డీ పొందిన కిషోర్‌కు సన్మానం



కిషోర్‌కుమార్‌ను సన్మానిస్తున్న మాదిగ జాగృతి సంఘం సభ్యులు

కొండాపూర్, ఆగస్టు 11 : కొండాపూర్ మండలం సైదాపూర్ గ్రామానికి చెందిన డాక్టర్ కిషోర్‌కుమార్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పార్మాస్యూటికల్ సైన్స్‌లో పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఆదివారం సైదాపూర్‌లో జిల్లా మాదిగ జాగృతి సంఘం సభ్యులు కిషోర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మల్లికార్జున్, మహేందర్, ఉపాధ్యక్షుడు యాదగిరి, కార్యదర్శి ఈశ్వర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల ఇన్‌చార్జి ఈవోను తొలగించండి

● భజరంగ్ దళ్ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న భజరంగ్‌దళ్ నాయకులు

పాపన్నపేట, ఆగస్టు 11 : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఏడుపాయల ఇన్‌చార్జి ఈవో కృష్ణప్రసాద్‌ను విధుల నుంచి తప్పించి, రెగ్యులర్ ఈవోను నియమించాలని భజరంగ్ దళ్ మండల శాఖ అధ్యక్షుడు బోల కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సెక్యూరిటీ సిబ్బందిని అజమాయిషీ చేయలేకపోవడం వల్లే దొంగతనం జరిగిందన్నారు. భక్తుల సొమ్ము దొంగల పాలైనా ఈవో కనీసం సంఘటన స్థలానికి రాలేదని, నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయలేదన్నారు. ఏటా రూ.12 కోట్ల ఆదాయం వచ్చే ఏడుపాయల ఆలయానికి రెగ్యులర్ ఈవో లేకపోవడం దురదృష్టకరమన్నారు.

చెట్లతిమ్మాయిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

మాసాయిపేట, ఆగస్టు 11 : మండలంలోని చెట్ల తిమ్మాయిపల్లి పులిగుట్ట తండాలో ఆదివారం జీఎఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తండాల్లో డయేరియా, విష జ్వరాలు ప్రబలుతున్న కారణంగా వైద్యం అందించాలని ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఫౌండేషన్ ప్రతినిధి లక్ష్మణ్‌రావు తెలిపారు. ఈ వైద్య శిబిరానికి పలు తండాల నుంచి వచ్చిన గిరిజనులకు, చుట్టుపక్కల గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ మోహన్ రాథోడ్, నాయకులు, గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వెల్దుర్తిలో ఉచిత కంటి వైద్యశిబిరం

వెల్దుర్తి, ఆగస్టు 11 : వెల్దుర్తిలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఆక్సివిజన్ లేజర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 65 మందికి ఉచితంగా పరీక్షలు చేశామని, ఉచితంగా మందులను పంపిణీ చేశామని వైద్యులు సురేష్ తెలిపారు. 20 మందికి కంటి ఆపరేషన్ అవసరం ఉన్నట్లుగా గుర్తించామని ఆయన పేర్కొన్నారు.



చెట్లతిమ్మాయిపల్లిలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



పట్టణంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పెరిగిన పిచ్చిమొక్కలు

చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకం

● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొలన్ బాల్‌రెడ్డి

గుమ్మడిదల, ఆగస్టు 11 : తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ప్రదర్శించిన ధైర్య సాహసాలు నేటి తరానికీ ఎంతో స్ఫూర్తిదాయకమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అన్నారు. ఆదివారం గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొలన్ బాల్‌రెడ్డి మాట్లాడుతూ సబ్బండ వర్గాల ఆత్మగౌరవ ప్రతీక చిట్యాల ఐలమ్మ అని కొనియాడారు. ఆమె స్ఫూర్తి తెలంగాణ రాష్ట్ర సాధనలోనూ అనంతరం ప్రగతి ప్రస్థానంలోనూ ఇమిడి ఉన్నదని తెలిపారు. దేశంలో మరెక్కడాలేని విధంగా రజకుల సంక్షేమం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు దేవేందర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, రవీందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, జిల్లా రజక సంఘం అధ్యక్షుడు సీతయ్య, మండల అధ్యక్షుడు వీరేశం, గ్రామ కమిటీ అధ్యక్షుడు మురళి తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో నాయకులు

భావి తరాలకు మహనీయులు ఆదర్శం : బీజేపీ

జిన్నారం, ఆగస్టు 11 : భావితరాలకు స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న మహనీయులు ఆదర్శమని మండల బీజేపీ నాయకులు అన్నారు. ఆదివారం జిన్నారంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు. సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని శుభ్రం చేసి క్షీరాభిషేకం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతీ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి జాతీయ సమైక్యతను చాటి చెప్పాలని పార్టీ జిల్లా, మండల నాయకులు ప్రతాప్‌రెడ్డి, జగన్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రమేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం శుభ్రం

నర్సాపూర్, ఆగస్టు 11 : నర్సాపూర్‌లో చిల్డ్రన్స్ పార్కులో పట్టించుకోకుండా ఓ మూలన ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం శుభ్రం చేసి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు పెద్దరమేష్‌గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.చిన్నరమేష్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చేస్‌యాదవ్, కౌన్సిలర్లు సురేష్, యాదగిరి, నాయకుడు చంద్రయ్య పాల్గొన్నారు.



సుభాష్‌చంద్రబోస్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

జహీరాబాద్, ఆగస్టు 11 : జహీరాబాద్ పట్టణంతోపాటు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల కంచె లోపలి భాగంలో పిచ్చి మొక్కలు, చెత్తా చెదరాన్ని తొలగించకపోవడంతో ప్రమాదకరంగా మారుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలతో తరచూ ఫీజులు పోతున్నాయి. పట్టణంలోనైతే వ్యాపార సముదాయల ముంగిట ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల కంచెకు బోర్డులను అతికించడం సర్వసాధారణమైంది. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



టాన్స్‌ఫార్మర్‌ను తాకుతున్న చెట్టు కొమ్మ